


ఒడిశా సీఎం మాఝీకి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# నైనీ కోల్‌బ్లాక్‌కు సహకరిస్తాం

- **తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఒడిశా సీఎం హామీ**

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఒడిశాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ కోల్‌బ్లాక్‌లో బొగ్గు తవ్వకాలు చేపట్టేందుకు అన్నివిధాలుగా సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తెలంగాణ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. ఇందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం ఒడిశాలో పర్యటించింది. తొలుత ఆ రాష్ట్ర సచివాలయంలో సీఎంతో భేటి అయ్యి నైనీ కోల్‌బ్లాక్‌లో బొగ్గు బ్లాక్ ప్రారంభానికి, బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని కోరగా.. సీఎం మాంఝీ సానుకూలంగా స్పందించారు. భూముల బదలాయింపు, విద్యుత్తు, రహదారుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయగా.. వాటిని వెంటనే పరిష్కరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. దీంతో ఇక్కడ 3 నెలల్లోపే బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. అనంతరం భట్టి విక్రమార్క అంగూల్ జిల్లాలోని నైని కోల్‌బ్లాక్ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరా భట్టి బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వాసితులతోను భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. తెలంగాణ ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సంస్థ సీఎండీ బలరాం, ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, సింగరేణి సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# కొండెక్కిన ధరలు




**జూన్‌లో 5.08 శాతంగా నమోదు • తారెత్తిస్తున్న పప్పులు, కూరగాయల రేట్లు • ఫలించని రిజర్వ్ బ్యాంక్ చర్యలు**

న్యూఢిల్లీ, జూలై 12: ద్రవ్యోల్బణం దడ పుట్టిస్తున్నది. గత నెల రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు 4 నెలల గరిష్ఠాన్ని తాకాయి. శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం జూన్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 5.08 శాతంగా నమోదైంది. ఫిబ్రవరిలో 5.09 శాతంగా ఉండగా.. మళ్లీ ఇప్పుడే ఆ స్థాయి దరిదాపుల్లో గణాంకాలున్నాయి. అంతకు ముందు మేలో 12 నెలల కనిష్ఠాన్ని సూచిస్తూ 4.80 శాతంగా ఉండటం గమనార్హం. కానీ ఈసారి అది మరింత పెరిగింది. ఇక గత ఏడాది జూన్‌లో 4.87 శాతంగా ఉన్నట్టు ఎన్ఎస్‌వో తెలియజేసింది.

**ఆర్బీఐపై ఒత్తిళ్లు**

అధిక ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఆర్బీఐ తీసుకుంటున్న చర్యలు ఫలించడం లేదు. నిరుడు ఫిబ్రవరి తర్వాతి నుంచి కీలక వడ్డీ రేట్లు యథాతథంగానే ఉంటున్న విషయం తెలిసిందే. జూన్‌లో జరిపిన ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలోనూ రెపోరేటును 6.50 శాతంగానే ఉంచింది. వాస్తవానికి వివిధ రంగాలు, వ్యాపార-పారిశ్రామిక వర్గాల నుంచి వడ్డీరేట్లను తగ్గించాలన్న డిమాండ్లు వస్తున్నా.. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వాటిని ఆర్బీఐ పక్కనపెడుతున్నది. అయితే వచ్చే నెల జరిగే ద్రవ్యసమీక్షలోనైనా వడ్డీరేట్లు తగ్గుతాయన్న ఆశలపై తాజా ద్రవ్యోల్బణ గణాంకాలు నీళ్లు చల్లాయి. ఇంకొంతకాలం ఆర్బీఐ కఠిన ద్రవ్య విధానాన్నే అనుసరించవచ్చన్న అంచనాలున్నాయి మరి. ఇటీవలి ఓ ఇంటర్వ్యూలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ సంకేతాలనూ ఇచ్చారు. ఆగస్టు 6-8 తేదీల్లో ఆర్బీఐ ద్రవ్యసమీక్ష ఉన్న సంగతి విదితమే. అలాగే ఆర్బీఐకి 4 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించినది తెలిసిందే.

**ఐఐపీ 5.90 శాతం**

దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ ఏడాది మే నెలలో 5.90 శాతంగా నమోదైంది. ఇది 7 నెలల గరిష్ఠం. గత ఏడాది అక్టోబర్‌లో ఐఐపీ 11.9 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయి దరిదాపుల్లో గణాంకాలున్నాయి. కాగా, విద్యుత్తు, గనుల రంగాల్లో ఉత్పాదకత పెరుగడం కలిసొచ్చిందని కేంద్ర గణాంకాలు, కార్యాచరణ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. నిరుడు మే నెలతో పోల్చితే విద్యుత్తు రంగం వృద్ధిరేటు 13.7 శాతానికి, గనుల రంగం వృద్ధి 6.6 శాతానికి పెరిగాయి. కీలకమైన తయారీ రంగం మాత్రం 6.3 శాతం నుంచి 4.6 శాతానికి దిగజారింది. ఇదిలావుంటే ఈ ఏడాది జనవరిలో 4.20 శాతంగా ఉన్న ఐఐపీ.. ఫిబ్రవరిలో 5.60 శాతం, మార్చిలో 5.40 శాతం, ఏప్రిల్‌లో 5 శాతంగా ఉన్నది. నిరుడు నవంబర్, డిసెంబర్లలో 2.50 శాతం, 4.40 శాతంగా ఉన్నాయి. ఇక నిరుడు మే నెలలో 5.70 శాతంగా ఐఐపీ ఉన్నట్టు అధికారిక లెక్కలు చెప్తున్నాయి.

## శాంతించని ఆహార ధరలు

ఆహార ద్రవ్యోల్బణం ఎంతకీ శాంతించడం లేదు. వరుసగా 8వ నెల కూడా 8 శాతంపైనే నమోదైంది. జూన్‌లోనైతే 9.36 శాతానికి చేరడం ఆందోళన కలిగిస్తున్నది. మే నెలలో ఇది 8.69 శాతంగా ఉన్నది. కూరగాయలు, పప్పుధాన్యాల ధరలు రెండంకెల స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. వరుసగా 29.3 శాతం, 16.1 శాతంగా ఉన్నాయి. కూరగాయల రేట్లు 10 శాతానికిపైగా ఉండటం వరుసగా ఇది 8వ నెల. పప్పుధాన్యాలైతే 13వ నెల కావడం గమనించదగ్గ అంశం. ఓ వైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. ఈసారి సాగుబడిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పంటల దిగుబడులు ఆశించిన స్థాయిలో వచ్చేలా కనిపించడం లేదు. దీంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక మార్కెట్లలో ఆయా ఆహారోత్పత్తుల రేట్లు రోజుకింత పెరుగుతూపోతూనే ఉన్నాయి. ఉత్తర భారతంలో వానలు దంచికొడుతున్నా.. దక్షిణాదిలో మాత్రం చినుకు రాలడం లేదు.

# బీఎస్ఎన్ఎల్ రూ.107 ప్లాన్

**మరో చౌక టారిఫ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ**




న్యూఢిల్లీ, జూలై 12: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్..మరో ప్లాన్‌ను పరిచయం చేసింది. ఒకవైపు టెలికం దిగ్గజాలు తమ ప్లాన్ల ధరలను పెంచుతూపోతుంటే..మరోవైపు బీఎస్ఎన్ఎల్ మాత్రం సామాన్యుడి లక్ష్యంగా చేసుకొని పలు ప్లాన్లను ఆవిష్కరిస్తున్నది. దీంట్లోభాగంగా 35 రోజుల కాలపరిమితితో రూ.107 కనీస రీచార్జి ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ కింద 200 నిమిషాలు ఏ నెట్‌వర్క్‌కైనా మాట్లాడుకోవచ్చును, అలాగే 3జీబీ డాటాను వినియోగించుకోవచ్చును. టెలికం దిగ్గజాలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా అందిస్తున్న ప్లాన్ల కంటే ఇదే చౌకది కావడం విశేషం. ఇటీవల కాలంలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు తమ ప్లాన్ల ధరలను 25 శాతం వరకు పెంచాయి. దీంతో కస్టమర్లు ఈ నెట్‌వర్క్‌లను వదిలి తక్కువ ప్లాన్లను అందిస్తున్న బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన నగరాల్లో 4జీ సేవలు అందిస్తున్న బీఎస్ఎన్ఎల్..వచ్చే నెల చివరినాటికి ఈ సేవలను దేశవ్యాప్తంగా విస్తరించాలనుకుంటున్నది.

- జియో రూ.189 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్‌ను అందిస్తున్నది. 28 రోజుల కాలపరిమితితో ఇదే చౌకైన ప్లాన్. అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, 2జీబీ డాటా, 300 ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చును
- ఎయిర్‌టెల్ రూ.199 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్ ప్రకటించింది. 28 రోజుల కాలపరిమితితో లభించే ఈ ప్లాన్ కింద 2జీబీ డాటా, 100 ఎస్ఎంఎస్‌లు
- అలాగే వొడాఫోన్ ఐడియా 28 రోజుల కాలపరిమితితో రూ.199 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్‌ను అందిస్తున్నది. ఈ ప్లాన్‌లో 2జీబీ డాటా, 300 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పంపుకోవచ్చును.





## హెచ్‌సీఎల్ 600 శాతం డివిడెండ్

న్యూఢిల్లీ, జూలై 12: ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.4,257 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 20.4 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 6.6 శాతం వృద్ధితో రూ.28,057 కోట్లు ఆర్జించింది. అంచనావేసిన దానికంటే అధికంగానే ఆర్థిక ఫలితాలు నమోదయ్యాయని కంపెనీ సీఈవో సీ విజయకుమార్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో వృద్ధి 3-5 శాతమని గైడెన్స్‌లో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.12 లేదా 600 శాతం మధ్యంతర డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది.

# ఆల్‌టైం హైకి సూచీలు

**80,519కి సెన్సెక్స్, 24,500 అధిగమించిన నిఫ్టీ**



ముంబై, జూలై 12: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. ఐటీ, టెక్నాలజీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో లాభాల్లో ప్రారంభమైన సూచీలు చివరివరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. దేశీయ టెక్నాలజీ దిగ్గజం టీసీఎస్ అంచనాలకుమించి లాభాలను ప్రకటించడంతో మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. వీటికితోడు అమెరికా ఫెడరల్ రిజర్వు వచ్చే సమీక్షలో వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు ఉండటం కూడా సూచీలు కదం తొక్కడానికి ప్రధాన కారణంగా నిలిచాయి. రిలయన్స్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగియడం పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్ వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 622 పాయింట్లు అందుకొని రికార్డు స్థాయి 80,519.34 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 996.17 పాయింట్లు(1.24 శాతం) లాభపడి ఆల్-టైం హై 80,893.51 వద్దకు చేరుకున్నది. మరోసూచీ నిఫ్టీ 186.20 పాయింట్లు పెరిగి 24,502.15 వద్ద స్థిరపడింది.

**టీసీఎస్ షేరు దూకుడు**

దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) షేరు రికార్డు స్థాయిలో దూసుకుపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాల్లో అంచనాలకుమించి రాణించడంతో కంపెనీ షేరు ఏడు శాతం వరకు లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. 6.68 శాతం లాభపడింది. దీంతోపాటు ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టెక్ మహీంద్రా షేర్లు మూడు శాతానికి పైగా లాభపడ్డాయి. అలాగే యాక్సిస్ బ్యాంక్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, ఎల్అండ్‌టీ, నెస్లె, ఎస్బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, ఎన్‌టీపీసీలు లాభాల్లో ముగిశాయి. కానీ, మారుతి, ఏషియన్ పెయింట్స్, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎయిర్‌టెల్‌లు నష్టపోయాయి.




# 20 నుంచి అమెజాన్ ప్రైమ్‌డే

న్యూఢిల్లీ, జూలై 12: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మళ్లీ ప్రైమ్ డే ఆఫర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నది. ఈ నెల 20 నుంచి 21 వరకు రెండు రోజులపాటు అన్ని రకాల ఉత్పత్తులపై తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ బ్యాంకుల కార్డులపై బుకింగ్ చేసుకున్నవారికి 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు కంపెనీ డైరెక్టర్ కిశోర్ తెలిపారు. అలాగే ఈసారి కొత్తగా 450 బ్రాండ్‌లకు చెందిన వెయ్యికి పైగా కొత్త ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

## సాస్ స్టార్టప్‌లకు టీ హబ్ దన్ను

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 12 (నమస్తే తెలంగాణ): స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి టీ హబ్ ప్రత్యేకంగా ల్యాబ్ 32 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇప్పటి వరకు 12 సార్లు నిర్వహించిన కార్యక్రమంలో 300లకు పైగా స్టార్టప్‌లకు పూర్తిస్థాయిలో సహకారం అందించామని, తాజాగా 13వ సారి ల్యాబ్ 32 కార్యక్రమానికి శ్రీకారంచుట్టామని టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆగస్టు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ తర్వాత ఎంపికైన స్టార్టప్‌లకు ఆగస్టు 27 నుంచి నవంబర్ 27 వరకు అన్ని రకాలుగా సేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అత్యాధునిక టెక్నాలజీలైన ఏఐ, మెషిన్ లర్నింగ్, బ్లాక్‌చెయిన్‌లతో మెటావర్స్, వెబ్ 3.0, ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ రంగాలకు సంబంధించిన స్టార్టప్‌లను ఎంపిక చేశామని, తాజా విడతలో కేవలం సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్) స్టార్టప్‌లను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.